క్లుప్తంగా

ఘనంగా ఎస్బీఐ ఆవిర్భావ దినోత్సవం



కోవూరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని మైథిలీ సెంటర్ శాఖలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. మేనేజర్ మధురిమ, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, సీనియర్ క్యాషియర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన



కొడవలూరు: డెంగీపై అవగాహన ర్యాలీని కొడవలూరులో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూస్తే, డెంగీ నుంచి కాపాడుకోవచ్చని వివరించారు. ఎస్‌యూఓ నాగరాజు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎల్టీ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



కోవూరు: డాక్టర్స్ డేను పురస్కరించుకొని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది వైద్యులను ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. వైద్యులు జ్యోతిప్రభ, సలావుద్దీన్, వంశీకృష్ణ, మొయిద్దీన్, వరుణ్‌కుమార్, కౌశిక్, కరుణాకర్, ఇర్ఫాన్, నిరంజన్‌ను సన్మానించారు. తొలుత బీసీ రాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. తహసీల్దార్ సుబ్బయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ లీలావతి, సైకాలజిస్ట్ డాక్టర్ నరసింహమూర్తి, ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్ది మారుతి, సత్యవతి దంపతులు, సభ్యులు నిఖిల్, ప్రసూనలత, సీనియర్ ఫార్మసిస్ట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకు పరామర్శ



కోవూరు: చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి మంగళవారం పరామర్శించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ'పై కార్యక్రమాలు

కోవూరు: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తుచేయడంతో పాటు ఆయన మోసపూరిత విధానాలతో ప్రజలకు తలెత్తే నష్టాలను వివరించేందుకు గానూ మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ అనే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు. నెల్లూరులోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. జూలై మూడు నుంచి ఆగస్ట్ నాలుగు వరకు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పడుగుపాడులోని రుక్మిణీ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఈ నెల ఏడో తేదీన నిర్వహించనున్నామని చెప్పారు. సమావేశంలో నేతలు వీరి చలపతి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, విజయకుమార్, సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండోసోల్ కంపెనీతో ఒప్పంద రద్దుకు డిమాండ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి వారికి కేటాయించిన 8338 ఎకరాలను రైతులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు, నేతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల పేరుతో బలవంతంగా భూములను లాక్కుంటే అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

దర్జాగా కబ్జా.. అడిగేవారేరీ?

- 50 శాతం ఆక్రమణకు గురైన పొదలకూరు చెరువు
- హద్దులు ఏర్పాటు చేయని అధికారులు
- మురుగు కాలువగా మారిన వరవ కాలువ
- వర్షాలు కురిస్తే మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు
- అధికారులకు బీజేపీ నేతల ఫిర్యాదు



పొదలకూరు చెరువులో నిర్మించిన ఇళ్లు (ఫైల్)



పట్టణంలో చెరువు వరవ కాలువ దుస్థితి

పొదలకూరు: మండలంలో చాలావరకు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు కబ్జాకు పాల్పడుతూ పంటల సాగు చేస్తున్నారు. కట్టడాలను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామ రైతులు ఆక్రమణల చెర నుంచి చెరువులను విడిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ఆక్రమణలను తొలగించాల్సిందిగా న్యాయస్థానాల నుంచి ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలున్నాయి. రెవెన్యూ, జలవనరుల శాఖలు సంయుక్తంగా హద్దులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది జరగకుంటే భవిష్యత్‌లో పట్టణ ప్రాంతాల్లో చెరువులు లేకుండా పోతాయి. మండల కేంద్రం పొదలకూరు చెరువు ఆక్రమణకు గురై ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మీనమేషాలను లెక్కిస్తున్నారు. ఇదే విషయమై బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించి చెరువును కావాల్సిందిగా డిమాండ్ చేశారు.

కాలనీకి సమీపంలో..

విష్ణువర్ధనపురం కాలనీకి సమీపంలో చెరువు ఉండటంతో దిగువ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు ఇష్టానుసారం ఆక్రమణలకు పాల్పడుతున్నారు. 162ఏ సర్వే నంబర్‌లో చెరువు విస్తీర్ణం మొత్తం 168 ఎకరాలుంది. ప్రస్తుతం సర్వే నిర్వహిస్తే చాలావరకు ఆక్రమణకు గురై ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఆక్రమణ వల్ల నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. మండలంలో 52 చెరువులున్నాయి. ఇవన్నీ జలవనరుల శాఖ పర్యవేక్షణలోనే ఉన్నాయి. ఏఒక్క దానికి కొత్తగా హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ఆయా గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్నాయి. నేదురుమల్లి, డేగపూడి, నావూరు, బత్తులపల్లి, పులికల్లు, మొగళ్లూరు, కనుపర్తి, మర్రిపల్లి, ఇనుకుర్తి, బిరదవోలు, పార్లపల్లి తదితర గ్రామాల నుంచి చెరువు ఆక్రమణలపై రెవెన్యూ శాఖకు గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు అందుతూనే ఉన్నాయి. కొందరు ఆక్రమణదారులు చెరువులను వ్యవసాయ భూమిగా మార్చివేస్తున్నారు.

వర్షా కాలంలో..

వర్షాలు బాగా కురిసి పొదలకూరు చెరువులోకి పుష్కలంగా నీరు చేరితే చెరువును ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్న లోతట్టు ప్రాంతం మునకకు గురవుతోంది. వీరిని రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతులను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి వస్తున్న వారు ఈ ప్రాంతంలో ఇళ్లను నిర్మించుకుంటున్నారు. కొందరు స్థానికులు కూడా పక్కాగా ఇళ్లను నిర్మించుకుని అద్దెలకు కూడా ఇస్తున్నట్టు సమాచారం. ఫలితంగా 50 శాతం చెరువు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు.

వరవ కాలువ ఆక్రమణ

వర్షా కాలంలో చెరువు నిండేందుకు ఎంతగానో ఉపయోగపడే వరవ కాలువలను సైతం ఆక్రమిస్తున్నారు. వాటి పక్కన తమ భూములుంటే కాలువలను కలిపేసుకుంటున్నారు. ఇదేమని మిగిలిన రైతులు ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారు. పొదలకూరు పట్టణంలో సుమారు కిలోమీటర్ పొడవున్న చెరువు వరవ కాలువ రూపురేఖలను కోల్పోయింది. పట్టణంలో వరవ కాలువ ఉండడంతో కబ్జా చేసి చాలామంది భవంతులు నిర్మించుకున్నారు. కొందరైతే కాలువను లేఅవుట్లలో కలిపేసుకుని దాని పక్కన కొత్తగా కాలువను తవ్వించారు.

రెవెన్యూ శాఖకు లేఖ రాస్తాం

"పొదలకూరు చెరువుకు హద్దులను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ శాఖకు లేఖ రాస్తాం. ఆక్రమణలు చాలాకాలంగా జరుగుతూనే ఉన్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనిపై త్వరలో చర్యలు తీసుకుని కార్యరూపం దాల్చేలా ప్రయత్నిస్తాం.

– అనిల్ కుమార్, ఇరిగేషన్ ఏఈ, పొదలకూరు

ఇల్లు ఖాళీ చేయాలంటూ బెదిరింపులు



సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇల్లు వదిలి వెళ్లాలంటూ తమ కుటుంబసభ్యులను కులం పేరుతో దూషిస్తూ కొందరు గ్రామస్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ మహిళ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల వివరాల మేరకు.. పట్టణంలోని ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెంలో షికారి రుక్మిణి, కుటుంబసభ్యులు బుట్టలు అల్లుకొని జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరైంది. స్థలంలో ఇల్లు కట్టుకుంటుండగా, గ్రామానికి చెంది గుంజి రామకృష్ణ, మల్లి, నరసింహులు కులం పేరుతో దూషిస్తూ.. గుడి పక్కన ఇల్లు ఉండేందుకు వీల్లేదని.. బడికి చెందిన ఆట స్థలమని.. తొలగించాలని బెదిరింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేయగా, తమకు అనుకూలంగా తీర్పొచ్చిందని తెలిపారు. అయినా తమను ఇబ్బంది పెడుతూ నిత్యం భయాందోళనలకు గురిచేస్తున్నారని వాపోయారు. మల్లి, నరసింహులుపై అట్రాసిటీ కేసు ఉందని, హైకోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా తమను నిత్యం వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు.

పింఛన్ల పంపిణీ

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఏడాదిలోనే రూ.కోట్లతో పనులు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట అధికారులు, పలువురు కూటమి నాయకులున్నారు.

ప్రజల పక్షాన పోరాడతాం



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పూజిత

- కాకాణి పూజిత

మనుబోలు: 'కేసులకు బయపడేది లేదు. ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం' అని మాజీ మంత్రి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత తెలిపారు. మంగళవారం మనుబోలు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకిచ్చిన వాగ్దానాలు సక్రమంగా అమలు చేయలేని ఈ ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. కోర్టులపై తమకు నమ్మకం ఉందని, నాన్న కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దువ్వూరు రాజేశ్వరమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, సూరపనేని కిశోర్ నాయుడు, ముంగర రవీందర్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, గుంజి రమేష్, దాసరి భాస్కర్‌గౌడ్, కంచి మణి, ఏలూరు భాస్కర్‌రెడ్డి, సన్నారెడ్డి జానకిరామిరెడ్డి, తులసీరాం, దయాకర్, గిరి, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాపురంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్, సిబ్బంది

పొదలకూరు: జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహ్మదాపురంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ ఇంటితోపాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పడేయొద్దన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు కె.శ్రీనివాసులు, యశోద, సహాయకులు పెంచలమ్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'వాహనమిత్ర' అమలుకు డిమాండ్



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వాహనమిత్ర పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆటో కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజ్‌ఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఆటో కార్మిక సంఘ జిల్లా మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడారు. ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం సరికాదని చెప్పారు. తొలుత సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఆటోలతో ర్యాలీని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మండల కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రూ.1.80 లక్షలతో పంట కాలువ పనులు



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ రాజమ్మ

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.1.80 లక్షలతో పంట కాలువలను అభివృద్ధి చేయనున్నట్లు ఏపీఓ రాజమ్మ తెలిపారు. కాగితాలపూరులో జరుగుతున్న పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రైతులకు అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తామన్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏలు గుర్రప్ప, ఎఫ్ఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



కోవూరు: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను వెంకురెడ్డి, కమలమ్మ స్మృత్యర్థం మద్దు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.పది వేలను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, డాక్టర్ జుల్ఫికర్ అలీ అహ్మద్, వెంకటరమణ, యూటీఎఫ్ నేతలు పర్వతరెడ్డి జనార్దన్‌రెడ్డి, భీమతాటి వెంకటరమణయ్య, హెచ్‌ఎం నావూరు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథక అమలుపై తనిఖీ



కోవూరు: పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సివిల్ సప్లయ్స్ డీఎం అర్జున్‌రావు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని వివరించారు. భోజన ఏజెన్సీని అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మండలంలోని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో ఆషాడమాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు అభిషేకం నిర్వహించారు. దేవి ఖడ్గమాలార్చన, కుంకుమపూజలు చేశారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా వేముల శ్రీనివాసులు, సంధ్య వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు



వీఎస్‌యూలో..



ముత్తుకూరులో..

వెంకటాచలం: డాక్టర్స్ డే సందర్భంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం, నోవా బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు ప్రారంభించారు. కరోనా అనంతరం ఏర్పడిన ఆరోగ్యపరమైన మార్పుల గురించి అవగాహన కల్పించారు. బ్లడ్ బ్యాంక్ అధినేత మోపూరు భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకుని మరికొందరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారి బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** స్వాతంత్ర్య సమరయోధుడు బిదాన్ చంద్రరాయ్ జయంతి సందర్భంగా రాయ్ ఫస్ట్ ఎయిడ్ ప్రొవైడ్ అసోసియేషన్, గ్రామీణ వైద్యులు బుజ్జమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక షాదీమంజిల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 150 మంది రక్తదానం చేశారు. గూడూరు మెడిప్లస్ సెంటరు వారు రక్తాన్ని సేకరించారు. ప్రధానంగా గర్భిణులు, తలసేమియా చిన్నారుల కోసం రక్తాన్ని సేకరిస్తున్నట్టు వైద్యులు వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండర్ రత్నం, కో – ఆర్డినేటర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



వరినాట్లను పరిశీలిస్తున్న ఏఓ

పొదలకూరు: రాయితీపై పిల్లిపెసర, జనుము, జీనగ పచ్చిరొట్ట విత్తనాలను రైతుసేవా కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్టు ఏఓ ప్రతాప్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నావూరుపల్లి, కనుపర్తి గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు తమ పేర్లను ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలో పేర్లు రాని వారు ఆర్ఎస్‌కే సిబ్బంది వద్దకు వెళ్లి వన్‌బీ లేదా పట్టాదారు పాస్‌పుస్తకం, లింకైన బ్యాంక్ ఖాతాలను అందజేయాల్సిందిగా వెల్లడించారు. వరినాట్ల తర్వాత రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ గురించి వివరించారు.

సీసీఆర్ కార్డులను తప్పక పొందాలి



కొడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు



కోవూరు: పాటూరులో..



విడవలూరులో..

కొడవలూరు: సీసీఆర్ కార్డులను కౌలు రైతులు విధిగా పొందాలని ఏఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం, కొడవలూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులు తమ ఆధార్, ఫొటోతో సంబంధిత వీఆర్వోను సంప్రదించి వీటిని పొందాలని సూచించారు. వరికి ఎకరాకు రూ.840, వేరుశనగకు ఎకరాకు రూ.280 చొప్పున ప్రీమియాన్ని బ్యాంక్‌లో చెల్లించి పంట బీమా చేయించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై జాబితాలో పేరు లేని వారు సంబంధిత రైతు సేవా కేంద్రంలోని వీఏఏను సంప్రదించాలని సూచించారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు విష్ణుప్రియ, కవిత తదితరులు పాల్గొన్నారు.

- **కోవూరు:** మండలంలోని పాటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత, వీఏఏ మాణిక్యం, ఎంపీఈఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- **విడవలూరు:** మండలంలోని అలగానిపాడు, ముదివర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, ఎంఏఓ లక్ష్మి, కామాక్షి, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.